క్లుప్తంగా

ఇస్లాంతో శాంతియుత జీవనం


మసీదులో అన్నదానం చేస్తున్న ముస్లింలు

చిల్లకూరు: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని మత గురువులు జామీయా మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. గూడూరు పట్టణంలోని పెద్ద మసీదులో శుక్రవారం వేకువ జామునుంచి ఉదయం వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మధ్యాహ్నం పేదలకు భారీ స్థాయిలో అన్నదానం చేశారు. అనంతరం మహ్మద్ ప్రవక్త జీవిత విశేషాలను వివరించారు. మత సామరస్యానికి ప్రతీకగా మిలాద్ ఉన్ నబీ నిలుస్తుందని అన్నారు.

దివ్యాంగులకు సరుకుల పంపిణీ


సరుకులు అందజేస్తున్న దాతలు, నిర్వాహకులు

గూడూరురూరల్ : గూడూరు పట్టణంలోని త్యాగరాజవీధిలో వెలసిన శ్రీకల్యాణ వీరభద్ర స్వామి దేవస్థాన ప్రాంగణంలో శుక్రవారం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో సౌందర్యమ్మ దాతృత్వంలో నిరుపేద దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని దివ్యాంగులైన ఉపాధ్యాయులు రంగయ్య, హరిత, ఆంధ్ర మహిళా మండలి సీనియర్ మెంబర్, ఉపాధ్యాయిని శశికళను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు మాధురి, కార్యదర్శి స్నేహలతా, శశిరేఖ, జీవని, సుప్రియ, రమాదేవి, మహిళా మండలి కార్యదర్శి విష్ణువందన, రెడ్ సంస్థ సభ్యులు సుధీర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసచారి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


లారీని క్రేన్‌తో బయటకు తీస్తున్న పోలీసులు

చిల్లకూరు: మండలంలోని జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు మండలంలోని ముత్యాలపాడు పంచాయతీకి చెందిన నందిపాక సోమశేఖర్, వంగపూడి వెంకటేష్ బైక్‌పై వెళుతుండగా వెనక నుంచి లారీ ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో స్థానికులు గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో సాగరమాల విస్తరణ పనులు జరుగుతున్నందున లారీ ఇరుక్కు పోవడంతో క్రేన్ ద్వారా దానిని బయటకు తీయాల్సి వచ్చింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి 'మన మిత్ర'పై అవగాహన

గూడూరు రూరల్ : డిజిటల్ గవర్నెన్స్ పేరుతో ప్రభుత్వం మన మిత్ర వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా సేవల వినియోగంపై శనివారం నుంచి సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తారని గూడూరు ఇన్‌చార్జి ఎంపీడీఓ మోహన్ తెలిపారు. మన మిత్ర వాట్సాప్ నెంబర్ ద్వారా 709 సేవలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నెంబర్‌ను ఎలా సద్వినియోగం చేసుకోవాలనే అంశంపై సచివాలయ ఉద్యోగులు అవగాహన కల్పిస్తారన్నారు.

9న ఇంటర్వ్యూలు


కలువాయి(సైదాపురం): రాపూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మండలంలో ఖాళీగా ఉన్న దాసరిపల్లి (ఓసీ), కలువాయి నడిమివీధి (ఓసీ), కనకమహల్ సెంటర్ (బీసీడీ) మూడు అంగన్‌వాడీ ఆయాలు ఖాళీలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 9న ఉదయం ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ సునంద తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆమె తెలిపారు.

కండలేరులో 40 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 40.172 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 12.250 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1000, పిన్నేరుకాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

చికెన్ ధరలు		06-09-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	110
లేయర్ లైవ్	:	123
బ్రాయిలర్ చికెన్	:	204
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	226
లేయర్ చికెన్	:	210

రాజులకే ఇలవేల్పు.. పోలేరమ్మ



- వందేళ్లకు ముందు నుంచే జాతర సంప్రదాయం
- మతాలకతీతంగా సాగుతున్న సంబరం
- సెప్టెంబర్ 10, 11 తేదీల్లో వెంకటగిరి జాతర
- లక్షలాదిగా తరలిరానున్న భక్తజనం

వెంకటగిరి(సైదాపురం): పడమర కొండల మధ్య ఎంతో ఆహ్లాదకరమైన రాజాల భవంతిలో మహా పట్ట మహిషి వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మతల్లి. ఆ తల్లి ఆశీసుల కోసం ఆనాటి రాజులే సాగిలపడ్డారు. కోర్కెలు తీర్చే కల్పవల్లిగా నిలుస్తోంది. 1919లో ప్రారంభమైన పోలేరమ్మ జాతర ఏటా క్రమం తప్పకుండా ఆ నాటి రాజా వారి కుటుంబీకులే నేటికీ అంగరంగవైభవంగా జాతరను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 10, 11 తేదీల్లో ఘనంగా జాతర నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ జాతరకు దేశ, విదేశాల నుంచి భక్తులు లక్షలాదిగా తరలిరానున్నారు. అందువల్లే ఈ జాతర ఖ్యాతి సరిహద్దులు దాటి ఖండాంతరాలకు పాకింది.

జాతర చరిత్ర

వెంకటగిరి ప్రాంతాన్ని సంస్థాన రాజులు ఏలుతున్న రోజులు అవి.. 1917లో వెంకటగిరి పట్టణంలో కలరా మహమ్మారి ఎంతో మందిని బలి తీసుకుంది. ఆ సమయంలో వెంకటగిరి సంస్థానాధీశులు భారీ ఎత్తున శీలత యాగం నిర్వహించారు. అనంతరం పోలేరమ్మ విగ్రహాన్ని రాజాప్యాలెస్‌కు సమీపంలో నిర్మించి 1919లో అత్యంత వైభవంగా పోలేరమ్మతల్లి జాతర నిర్వహించారు. జాతర ముందు వెంకటగిరి పొలిమేర్లలో గ్రామశక్తి శిలలను ఏర్పాటు చేశారు. అమ్మవారికి బంగారు ఆభరణాలు చేయించి అంగరంగ వైభవంగా జాతర మహోత్సవానికి శ్రీకారం చుట్టారు. ఆ నాటి నుంచి జాతర దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నప్పటికీ వెంకటగిరి రాజాలకే తొలి ప్రాధాన్యతనిస్తూ సంప్రదాయాలను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే అమ్మవారికి రాజాల నివాసం నుంచి పట్టు వస్త్రాలను రాజాల ప్రతినిధుల ద్వారా అందజేస్తారు. 2023లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించారు. మతాలకతీతంగా జరిగే పోలేరమ్మ జాతరపై అన్ని మతాల్లో బలమైన విశ్వాసం నేటికీ చెక్కు చెదరకుండా ఉంది. అంతరించిపోతున్న నిమ్నవర్గాల, జానపద కళారూపాలు ప్రదర్శించేందుకు అరుదుగా వచ్చే అవకాశం వెంకటగిరి జాతరే.


పోలేరమ్మ తల్లి ఆలయం


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తజనం(ఫైల్)

కుమ్మరిల్లే పుట్టినిల్లు.. మెట్టినిల్లు రజకుల ఇల్లు

అమ్మవారి పుట్టినిల్లు అయిన కుమ్మరింట్లో బుధవారం మట్టితో పోలేరమ్మ తల్లి ప్రతిమను తయారు చేస్తారు. అయితే పుట్టినిల్లు అమ్మవారికి కళ్లు, దిష్టి చుక్క పెట్టరు. పుట్టింట్లోనే అదే రోజు సాయంత్రం 7 నుంచి రాత్రి 10 గంటల వరకు భక్తుల దర్శనార్థం నిలుపుతారు. కాంపౌండ్‌లో గాలిగంగులకు పూజలు నిర్వహిస్తారు. తరువాత పోలేరమ్మ తల్లిని సమీపంలో ఉన్న జీనుగుల వారి వీధికి తీసుకెళ్తారు. అక్కడే అత్తగారి ఇంటి దగ్గర రజకులు పోలేరమ్మ తల్లిని మెట్టినింటికి ఆహ్వానిస్తారు. అక్కడ అమ్మవారి ప్రతిమకు కళ్లు, దిష్టిచుక్క పెట్టి ఆభరణాలతో అలంకరిస్తారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై పోలేరమ్మతల్లిని ఆసీనురాలు చేసి ఊరేగింపు ప్రారంభమవుతుంది. గురువారం తెల్లవారు జాము వరకు గుడి వద్దకు చేరుకుంటుంది. గురువారం తెల్లవారు జాము నుంచి భక్తులకు పోలేరమ్మ దర్శన భాగ్యం కల్పిస్తారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో దున్నపోతును బలి ఇస్తారు. అనంతరం గండదీపంగా పిలవబడే నూనెదీపంతో రజక వ్యక్తిని వీధులన్నిటిలో తిప్పుతారు. బలి ఇచ్చిన దున్నపోతు రక్తంతో తయారు చేసిన అన్నంను పొలిమేరల్లో చల్లుతారు. వెంటనే పోలేరమ్మతల్లి ఊరేగింపు ప్రారంభమవుతుంది. ఈ ఊరేగింపు మల్లమ్మగుడివీధి వద్ద ఉన్న నిష్కమణ మండపం వద్దకు చేరుకోగానే అమ్మవారి కళ్లను తొలగిస్తారు. పోలేరమ్మ విగ్రహం మట్టిని తీసుకునేందుకు భక్తులు పోటీ పడుతారు. ఈ మట్టిని ఇంట్లో కొలువు తీరిస్తే శుభం కలుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో పోలేరమ్మతల్లి జాతర ముగుస్తుంది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దొరవారిసత్రం: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని స్థానిక ట్రాన్స్‌కో ఏఈ జగదీష్ తెలియజేశారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల వలన వేణుంబాకం, నేలపట్టు, ఏకొల్లు, అక్కరపాక, కుప్పారెడ్డిపాళెం, గొల్లపాళెం, అయ్యాపాళెం, మేలుపాక, పాళెంపాడు గ్రామాల్లో విద్యుత్ ఉండదని చెప్పారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి రూరల్: పట్టణంలోని 132 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ శీనయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని మరమ్మతుల నిమిత్తం ఉదయం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు వెంకటగిరి పట్టణం, రూరల్, డక్కిలి, బాలాయపల్లి, మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

ఎన్నికల హామీలను నెరవేర్చుతున్నాం

ఓజిలి: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చుతోందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మండలంలోని కురుగొండ గ్రామంలో పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో శుక్రవారం ఆమె పాల్గొన్నారు. చైర్మన్ దారా అంకయ్య, డైరెక్టర్లు మల్లికార్జునరెడ్డి, రవీంద్రరాజుకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

వైభవంగా పవిత్రాల సమర్పణ



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, స్వామి అమ్మవార్లను క్షేత్రోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో కొనసాగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆది లక్ష్మీదేవి, చెంచు లక్ష్మీదేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను తిరుచ్చిపై కొలువుతీర్చారు. అనంతరం వివిధ పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించి కోన తిరుమాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఆలయాల్లో పవిత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పవిత్రాలను దర్శించుకున్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన ఎస్‌డబ్ల్యూఎఫ్ కమిటీ సభ్యులు

వాకాడు: మండల కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) యూనియన్ కార్మికులు శుక్రవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ నాయకులు, కార్మికులు స్థానిక ఇరిగేషన్ అతిథి గృహంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అందులో డిపో అధ్యక్షుడిగా జి సుబ్రమణ్యం, కార్యదర్శి షేక్ వజీర్‌బాషా, సహాయ కార్యదర్శిగా డి బలరామయ్య, కెవి సుబ్బయ్య, ఉపాధ్యక్షులు డి రవి, ఆర్‌ఎస్ వాసు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో డిపో గౌరవ అధ్యక్షుడు గణపతి కిషోర్‌నాయుడు, జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్ తదతరులు పాల్గొన్నారు.

9న రైతు సమస్యలపై నిరసన


సమావేశంలో మాట్లాడుతున్న రామ్‌కుమార్ రెడ్డి

సూళ్లూరుపేట/సైదాపురం/నాయుడుపేటటౌన్/ఓజిలి: వ్యవసాయం పట్ల కూటమి ప్రభుత్వం చూపుతున్న వివక్షపై రైతులతో కలసి ఈ నెల 9న గూడూరు ఆర్డీవో కార్యాలయం వద్ద రైతులతో కలసి నిరసన తెలపనున్నట్లు వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. దీనికి గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాలకు చెందిన పార్టీ శ్రేణులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. వెంకటగిరిలోని ఎన్‌జేఆర్ భవనంలో శుక్రవారం నియోజకవర్గానికి చెందిన అన్ని మండలాల నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. మండల కన్వీనర్లు పులి ప్రసాద్‌రెడ్డి, కాల్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, వెందోటి కార్తీక్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, మన్నారాపు రవికుమార్ యాదవ్, రాపూరు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై సూళ్లూరుపేటలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు సూళ్లూరుపేట ఎంపీపీ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు అల్లూరు అనిల్ కుమార్‌రెడ్డి, నాయుడుపేట వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు కలికి మాధవ రెడ్డి, ఒట్టూరు కిషోర్ యాదవ్, మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, వైఎస్సార్‌సీపీ ఓజిలి మండల కన్వీనర్ పాదర్తి హరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రైతులు కష్టాలు ఎదుర్కోవడం అలవాటుగా మారిపోయిందన్నారు. వైఎస్సార్ సీపీ అంటే రైతుల ప్రభుత్వం, టీడీపీ ప్రభుత్వం అంటే రైతు వ్యతిరేక ప్రభుత్వమనేది రైతుల్లో నాటుకు పోయిందన్నారు. రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ఈ ప్రభుత్వంపై పోరుకు అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సూళ్లూరుపేట సమావేశంలో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ జెట్టి వేణుయాదవ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఓజిలిలో మండల మాజీ కన్వీనర్ దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, నాయకులు మొక్కపాటి వెంకట ప్రసాద్, ఓజిలి నారాయణ, దేవారెడ్డి అఖిల్‌రెడ్డి, శ్రీపతి ముత్యాలయ్య, శ్రీపతి వెంకటకృష్ణయ్య, పరసా శంకర్ పాల్గొన్నారు. నాయుడుపేటలో నాయకులు కట్టా భవాని శంకర్ రెడ్డి, కాళహస్తి భవాన్ అనుదీప్, గంధవల్లి సిద్ధయ్య పాల్గొన్నారు.


ఓజిలి: మాట్లాడుతున్న మండల కన్వీనర్ పాదర్తి హరనాథ్‌రెడ్డి


సూళ్లూరుపేట: సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గురుపూజోత్సవం

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లోని పాఠశాలల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. విద్యాశాఖాధికారుల ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. - సాక్షి నెట్‌వర్క్


తడ: ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంఈఓలు


సూళ్లూరుపేట: షార్‌లోని సెంట్రల్ స్కూల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


కలువాయి: ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం


వెంకటగిరి : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలి పురస్కారం అందుకుంటున్న గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి


డక్కిలి: పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులతో అధికారులు


రాపూరు : ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంఈఓ జిలాని


చిల్లకూరు: ఉత్తమ ఉపాధ్యాయురాలు వరలక్ష్మీని సత్కరిస్తున్న అధికారులు


కోట: ఎంఈవో కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


సైదాపురం: విద్యావనరుల కేంద్రంలో ఉపాధ్యాయులకు సన్మానం

జాతరకు సీఎంకు ఆహ్వానం

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి గ్రామశక్తి శ్రీ పోలేరమ్మతల్లి జాతర ఈ నెల 10, 11 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో సీఎం నారా చంద్రబాబుకు, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆహ్వాన పత్రికను అందించి జాతరకు ఆహ్వానించారు.

సూళ్లూరుపేట ఎంఈఓగా సునీల

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట ఎంఈఓగా ఎంఎస్ సునీల శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులు రెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సునీల బాధ్యతలు తీసుకున్నారు. ఆమె మన్నారుపోలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల భౌతికశాస్త్రం ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

భక్తి శ్రద్ధలతో లక్ష్మీ గణపతి హోమాలు

చిల్లకూరు : వినాయక చవితిని పురస్కరించుకుని తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాల్లో భాగంగా చివరి రోజైన శుక్రవారం గూడూరు పట్టణంలోని పలు వినాయక ఆలయాల్లో ప్రత్యేక పూజలు, లక్ష్మీ గణపతి హోమాలను నిర్వహించారు. గూడూరు రైల్వే క్వార్టర్స్ సమీపంలో ఉన్న వరసిద్ధి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచి పెట్టిన అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కోడూరు కల్పలత, మీరారెడ్డి దంపతులు వ్యవహరించారు. అలాగే రాజావీధిలోని వినాయక ఆలయంలో ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు అనంతరం అన్నదానం చేశారు.

చెరువు ఆక్రమించి కందకం తవ్వి..


చెరువులో కందకాన్ని పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈ

చిట్టమూరు: మండల పరిధిలోని నార్తువరత్తూరు చెరువు లోతట్టు భూమిని ఆక్రమించి కందకం తవ్వారని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ ఏఈ అబ్దుల్ ఘనీకి రైతులు ఫిర్యాదు చేశామన్నారు. దీంతో చెరువులో తవ్విన కందకాన్ని పరిశీలించి ఆయన తహసీల్దార్ నవీన్‌కుమార్‌కు తెలిపారు. ఆయకట్టు రైతులు మాట్లాడుతూ చెరువు పైభాగంలో లోతుగా కందకం తవ్వి చెరువులోని నీరు తమ పొలాల్లోకి వెళ్లకుండా చేశారన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి చెరువులో అక్రమంగా వేసిన కందకాన్ని తొలగించి ఆయకట్టు రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ సర్వే చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం


బీజేఎంఎస్ జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు

చిల్లకూరు: రాష్ట్రంలో అసంఘటిత రంగ కార్మికులకు అండగా ఉంటామని నూతనంగా ఎంపికైన భారతీయ జనతా మజ్దూర్ సంఘ రాష్ట్ర అధ్యక్షులు మధుసూదన్‌యాదవ్ తెలిపారు. గుంటూరులోని మజ్దూర్ సంఘ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ అసంఘటిత కార్మికులుగా ఉన్న హోంగార్డు, ఆశా వర్కర్ల ఉద్యోగ భద్రతకు భరోసా కల్పించేలా చూస్తామని అన్నారు. కార్మికులు కుటుంబ సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తామని అన్నారు. కార్యక్రమంలో బీజేఎంఎస్ జాతీయ అధ్యక్షులు శాంతప్రకాష్ జటావ్, ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీవరప్రసాద్, తెలంగాణా రాష్ట్ర అధ్యక్షులు పలగాని శ్రీనివాసరావు గౌడ్, శివ శంకర్, బండి యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.